విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : రైతులు విత్తన ఎంపికల్లో జాగ్రత్తలు పాటించాలని ఊటుకూరు వ్యవసాయ క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారు మండల పరిధిలోని నానపల్లి పంచాయతీలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు ముందు తీసుకోవాల్సిన మెలకువలు గురించి వివరించారు. వివిధ పంటలలో విత్తన ఎంపికలో జాగ్రత్తలు, ప్రధాన పంటలలో రకాలు, విత్తన శుద్ధి, దుక్కుల, ఎరువుల యాజమాన్యం పద్ధతులు తెలియజేశారు. జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎ. నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ద్వారా వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను పచ్చి రొట్టె పైర్లు, జిప్సం, జీవన ఎరువుల వినియోగం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తూ జిల్లాకు అనుకూలమైన కొత్త రకాల పంటలను సాగు చేస్తూ లాభదాయకమైన దిగుబడి వైపు సాగాలి అని తెలిపారు.

తగ్గిన పాల దిగుబడి

- నిర్వహణ ఖర్చులు పెరగడంతో పోషణపై ప్రభావం
- ధరలు పెంచాలని రైతుల వినతి

నెర్రవాడలో ఆటో ద్వారా పాల సేకరణ

ప్రజాశక్తి - చాపాడు

వ్యవసాయం తర్వాత జిల్లా ప్రజల ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమ. రైతులతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలు పాడి ద్వారా జీవనం సాగిస్తున్నారు. పాలను సేకరిస్తూ వాటిని పట్టణాలలోని గృహాలకు, హోటళ్లకు అందిస్తూ వందలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు. పాడి పరిశ్రమ ద్వారా వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.

గత ప్రభుత్వంలో విఫలం..

గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి పాలను సేకరించేందుకు కసరత్తు చేసి అమలు చేయలేకపోయింది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో పాడి పరిశ్రమకు సంబంధించిన వివరాలను సేకరించే కేంద్రాలను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టి పూర్తి చేయడంలో విఫలమైంది. ఆనంద్ మిల్క్ యూనియన్ లిమిటెడ్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొని పాల సేకరణ భవనాలు నిర్మాణానికి ఏర్పాటు చేసి పూర్తి చేయలేదు. ప్రతి ఆర్‌బికె సమీపంలో ఉపాధి హామీ నిధులతో పాల సేకరణ కేంద్రాలను నిర్మించి ఏర్పాట్లు ముమ్మరం చేసి వదిలేశారు. జిల్లాలో 633 రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. వీటి పరిధిలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు నుండి పాలను సేకరించాలని ప్రభుత్వం రంగం సిద్ధం చేసి అమలులో విఫలమైంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడి పరిశ్రమపై ఎలాంటి నిర్ణయాత్మక చర్యలు చేపట్టలేదు.దీంతో ప్రయివేట్ నిర్వాహకుల ఆధ్వర్యంలో పాల సేకరణ కొనసాగుతుంది. పాడి పోషకులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పటం లేదు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు మహిళా సంఘాల ద్వారా పాలసేకరణ చేపట్టే ప్రయత్నం చేసి కొంత మేర మంచి ఫలితాలు సాధించారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా జిల్లాలో 17 ప్రాంతాల్లో పాల సేకరణ కేంద్రాలు కొద్దిరోజులు నడిపి తర్వాత మూత వేశారు. ప్రస్తుతం ప్రయవేట్ పాల కేంద్రాల నుంచి రైతులకు ఎలాంటి లబ్ధి అందడం లేదు. పాడి రైతులకు ఖర్చులు పెరగడంతో ప్రభుత్వం ద్వారా పల్లెల్లో పాల ఉత్పత్తి ప్రోత్సహించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

గణనీయంగా తగ్గిన పాల దిగుబడి...

రాష్ట్రంలోనే పాల ఉత్పత్తిలో పేరుగాంచిన చాపాడు మండలంలో ప్రస్తుతం పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పట్టింది. గాంధీ నగరంలో పశువుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతుంది. గతంలో ఈ గ్రామంలో అధిక పాల దిగుబడి సాధించడంతో అనేకమార్లు అవార్డు అందుకొంది. ప్రస్తుతం ప్రభుత్వం పాల సేకరణ కేంద్రాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పాల దిగుబడి తగ్గింది. ధరలు పెంచాలని రైతులు కోరుతున్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో పదికి పైగా ప్రయివేటు కొనసాగుతుంటే, ప్రభుత్వ కేంద్రాలు ఒకటి కూడా లేకపోవడం ఇందుకు నిదర్శనం. ప్రయివేట్ కేంద్రాల ముందు నిలువలేక పోయాయి. ప్రయివేట్ పాల సేకరణ కేంద్రాల ద్వారా రైతులకు ఎలాంటి ప్రోత్సాహకం ఉండడంలేదు. గతంలో పాడి పశువులను కొనుగోలు నిర్వహణకు ఆర్థిక సాయం కూడా ప్రభుత్వాలు అందించేది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడి పరిశ్రమకు ఎలాంటి ఆదరణ కనిపించడం లేదు. పాడి రైతుల కంటే పాల సేకరణ చేసే వారికే లాభాలు అధికంగా ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో ఒక రోజుకు లక్ష లీటర్ల వరకు పాల సేకరణ చేస్తున్నారు. పశువుల దాణా, గడ్డి రేట్లు విపరీతంగా పెరగడంతో పశువుల పోషణ భారం అధికమై, పాడి రైతుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతుంది .50 కేజీల పశువుల దానా రూ. 1500, ఎకరా వరిగడ్డి రూ.పదివేల వరకు అవుతుండడంతో పాడి రైతులు చాలామంది వెనుకడుగు వేస్తున్నారు.

వెన్న శాతంతో నష్టం...

ప్రయివేట్ వ్యాపారులు పాలు, వెన్న శాతం ప్రకారం ధరలు నిర్ణయిస్తున్నారు. 10 శాతం వెన్న వస్తే లీటర్‌కు రూ. 77 చెల్లిస్తున్నారు. వ్యాపారులు మాత్రం మార్కెట్‌లో లీటర్ల ప్రకారం ధర నిర్ణయించి కల్తీ వ్యాపారంతో కాసులు సొమ్ము చేసుకుంటున్నారు.1987లోనే మండల పరిధిలో ప్రభుత్వం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సభ్యుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి వేల లీటర్లు మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ పాల కేంద్రాలకు తరలించారు. తర్వాత కాలంలో ప్రయివేట్ పాల కేంద్రాల దాటికి ప్రభుత్వ కేంద్రాలు మూత పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం నూతన పాల సేకరణ విధానం తీసుకు వచ్చి తిరిగి పాత పద్ధతులు తీసుకురావాలన్న ఆలోచనలో ఉంది. జిల్లాలో సుమారు ఐదు లక్షల ఆవులు, పశువులున్నాయి. అధికారికంగా రోజూ ఆరు లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో పాల ఉత్పత్తులు అత్యధికంగా మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఉన్నవి. ప్రయివేట్ కేంద్రాల నుంచి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పాలతో పాటు మజ్జిగ ఇతర ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో గ్రామాలలో పాలను కొనుగోలు ఎప్పుడు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వెన్న శాతం 10 అయితే రూ.77 లీటర్‌కు చెల్లిస్తున్నారు. వెన్న శాతం తగ్గితే రూ. 40 నుంచి 50లు మాత్రమే రైతులకు అందుతున్నది. దీనితో ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పాలసేకరణ కొనసాగితే రూ. 10 సంపాదించుకోవచ్చు అని పాడి రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

వెన్న శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి

పాలను వ్యాపారులు వెన్న శాతంతో సంబంధం లేకుండా ధరను నిర్ణయించి కొనుగోలు చేపట్టాలి. వెన్న శాతంతో పాలను సేకరిస్తుండడం వల్ల లీటరుకు రూ. 50 కూడా గిట్టుబాటు కావడం లేదు. పోషణ ఖర్చులు అధికమవుతున్నాయి. దానా, గడ్డి ఖర్చులు అధికమయ్యాయి. పశు పోషణ భారం అయినది. ప్రభుత్వం సహకారం అందివ్వాలి.

-వీరమ్మ, పశుపోషకురాలు, సిద్దారెడ్డిపల్లె, చాపాడు.

లీటర్ రూ.90తో కొనుగోలు చేయాలి

ప్రస్తుతం ప్రయివేట్ వ్యాపారులు వెన్న శాతం ఆధారంగా గరిష్టంగా లీటరు రూ. 77తో కొనుగోలు చేపడుతున్నారు. ఈ విధానం ద్వారా పశుపోషణ కష్టతరమవుతున్నది. ప్రభుత్వ ఆధ్వర్యంలో వెన్న శాతంతో సంబంధం లేకుండా లీటరు రూ. 90కు పాలను సేకరిస్తే పశుపోషకులకు ఇబ్బంది ఉండదు. పశువులకు పచ్చి గడ్డి, ఎండు గడ్డి దొరకడం కష్టతరంగా ఉంది తౌడు 50 కిలోలు, రూ.1500 వరకు ధర పలుకుతుంది. పశు పోషణ ఖర్చులు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం నుంచి సహకారం అందివ్వాలి.

- నారాయణమ్మ, చల్లబసాయపల్లె, దువ్వూరు మండలం.

పోరాటాలతోనే హక్కులు సాధ్యం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

జెండా ఆవిష్కరిస్తున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

పోరాటాలతోనే హక్కులు సాధ్యమవుతాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. శుక్రవారం సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు 1970, మే 30న కలకత్తా నగరంలో 'ఐక్యత బిపోరాటం' అనే నినాదంతో ఆవిర్భవించిందని తెలిపారు. ఇప్పటికీ 54సంవత్సరాలు పూర్తిచేసుకుని 55వ సంవత్సరంలోకి సిఐటియు అడుగు పెట్టిందన్నారు. 54 సంవత్సరాల పాటు కార్మికుల హక్కులు, శ్రేయస్సు కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ ఉందని తెలిపారు. దేశంలో ఏ కార్మికుడికి సమస్య వచ్చినా సిఐటియు అగ్రభాగాన నిలబడిందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసే దానికోసం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు . 29 లేబర్ చట్టాలను కుదించి 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల పైన మరింత పని భారం మోపే దానికోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ,రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. సిఐటియు ఎర్రజెండా ఎప్పటికీ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. జులై 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని సమ్మె చేస్తున్నామని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులను మతం పేరుతో విభజిస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు ఐక్యమైతే భారతదేశంలో బిజెపి నామరూపం లేకుండా పోతుందనే భయంతో ఈ విధంగా కార్మికుల మధ్య ఐక్యత లేకుండా చేస్తున్నారని తెలిపారు. కార్మికులు ఎప్పటికైనా ఐక్యం కాక తప్పదన్నారు. లేబర్ కోడ్స్ తిప్పి కొడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రా రెడ్డి,పి. వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, కోశాధికారి ఎస్ గోపి, నగర అధ్యక్షులు రవి, ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, ఇమామ్, నరేంద్ర, శివయ్య, మెడికల్ రెప్ యూనియన్ నాయకులు రామాంజనేయులు రెడ్డి, మహేష్, పవన్, దస్తగిరి, హరి కొండయ్య , శ్యామ్, అఖిల్, నరేంద్ర పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు రాజీలేని పోరాటం చేస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఏర్పడి 55 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పాత బస్టాండ్‌లో శుక్రవారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక చట్టాలు రద్దు చేస్తూ ఉందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును ఎదుర్కోవడంలో సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఏ కార్మికుని కష్టం వచ్చినా సిఐటియు ముందు ఉంటుందని వారి సమస్యల్లో భాగస్వామ్యం అవుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు బాబు, చంటి, ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి బాలసుబ్బయ, అంగన్వాడి యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, మున్సిపల్ యూనియన్ నాయకులు రవి, నీతమ్మ, గురమ్మ, అన్నపూర్ణ, ఆటో యూనియన్ నాయకులు రమేష్, శీను, గౌస్ డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

కడపపై జగన్‌కు భ్రమలు తొలగిపోయాయి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపపై మాజీ సిఎం వై.ఎస్. జగన్‌కు ఉన్న భ్రమలన్నీ తొలగిపోయాయయని, మహానాడు విజయవంతం కావడంతో కొన్ని దుష్టశక్తులు కమిలిపోతున్నాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన టిడిపి ఉమ్మడి కడప జిల్లా నాయకులకు, కో- ఆర్డినేషన్ కమిటీ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం నగరంలోని హోటల్ హరితలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లా టిడిపినాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంగా మహానాడును దిగ్విజయంగా నిర్వహించారని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలకున్న అపారమైన నమ్మకం మరోసారి రుజువైందన్నారు. రోడ్డు, భవనాల శాఖ మంత్రి మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా కడపలో మహానాడు నిర్వహణకు అవకాశమిచ్చిన సిఎం చంద్రబాబుకు, మంత్రిలోకేశ్ కు ధన్యవాదాలు తెలిపారు. మహానాడు విజయంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పదికి పది శాసనసభ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడప మహానాడు విజయంతం కావడంతో టిడిపి శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చిందని తెలిపారు. మహానాడు వేదికగా రాయలసీమ ఉజ్వల భవిష్యత్తుకు సిఎంచంద్రబాబు భరోసా ఇచ్చారన్నారు. రాయలసీమను సస్య శ్యామల చేయడమే కాకుండా సుసంపన్నం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి మాట్లాడుతూ ప్రజలతో పాటు ప్రకృతి కూడా టిడిపి మహానాడు విజయవంతానికి సహకరించిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి, భూపేష్ రెడ్డి, జగన్ మోహన్ రాజు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

యోగాంధ్రాను పక్కాగా నిర్వహించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి -కడప

జూన్ 21 వరకు 'యోగాంధ్ర- 2025' కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పిఎం-సూర్యఘర్ పథకం, ఎన్‌టిఆర్ వైద్యసేవలు, స్వచ్ఛఆంధ్ర, హరితాంధ్ర, హౌసింగ్ తదితర అంశాలపై. శుక్రవారం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్ తోపాటు జెసి అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ 11వ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటారని , రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది హాజరయ్యే లక్ష్యంతో అధికారులు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో ఒక్కొక్క రోజు ఒక్కో జిల్లాలో రాష్ట్రస్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి విజన్-2047లో పేర్కొన్న విధంగా ఆరోగ్య ఆంధ్రను నిర్మించడానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగాపై గ్రామ, మండల, జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన మున్సిపాల్టీ, ప్రతి గ్రామంలో యోగా గురించి ప్రజలందరికీ తెలియజేసి రోజూ ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ప్రజలందరూ యోగా చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆదివారం ఉదయం పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని సంస్థాగత, పబ్లిక్ ప్రదేశాల్లో జిల్లాలో యోగా క్యాంపెయిన్‌లను నిర్వహించాలన్నారు. ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం : ఒంటిమిట్ట దేవాలయ ప్రాంగణంలో, దక్షిణ ద్వారం ఉద్యానవనంలో యోగ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. జూన్ 5, సిద్దవటం కోట వద్ద, 12న శిల్పారామంలో, 18న గండికోట కోట/లోయ వద్ద ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమాల్లో ఆయా ప్రాంత ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్ రెడ్డి, సిపిఒ హాజరతయ్య, డిపిఒ రాజ్యలక్ష్మి, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీలు రాజ్యలక్ష్మి, అదిశేషారెడ్డి, కిరణ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన బాలల వేసవి వినోదం

అలరించిన విజ్ఞాన కార్యక్రమాలు
విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

'కడప బాలోత్సవం' వారి చే మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించిన 'బాలల వేసవి వినోద శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్కూలు హెచ్.ఎం.నాగమణి మాట్లాడుతూ చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం, ఇంద్రజాల ప్రదర్శన విషయాలపై హైస్కూలు విద్యార్థులకు ఈనెల 1 నుంచి 30 వరకు శిబిరం కొనసాగించడం అభినందనీయమన్నారు. వినోదం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం ముఖ్యాంశాలుగా నిర్వహించారని తెలిపారు. దీని ద్వారా పిల్లలు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులై సమాజానికి ఉపయోగపడే భావి భారత పౌరులుగా తయార అవుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కడప బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నాగముని రెడ్డి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందని, రానున్న సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్ ట్రైనర్ కృపావేణి మాట్లాడుతూ వేసవి సెలవులలో అదనపు విజ్ఞానాన్ని, వినోదాన్ని సృజనాత్మక కార్యకలాపాల ద్వారా పొందారని, ఈ ప్రయత్నాల్ని కొనసాగిస్తూ ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. సమయపాలన, క్రమశిక్షణ విద్యార్థుల ఎదుగుదలకు, దేశ భద్రతకు ఎంతో అవసరమని తెలిపారు. రిటైర్డ్ హెచ్ఎం బాల ఎల్లారెడ్డి మాట్లాడుతూ వేసవి వినోద శిబిరం విజయవంతానికి సహకరించిన శిక్షకులకు, విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బాలల శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమ అనుసంధాన కర్తగా వ్యవహరించిన అరుణ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పాఠ్యాంశాల ద్వారా గ్రహించి నిత్యజీవితంలో శాస్త్రీయ సూత్రాలను అన్వయించుకోవాలని కోరారు. జన విజ్ఞాన వేదిక కడప పట్టణ అధ్యక్షుడు ఎన్. శివరాం మాట్లాడుతూ వేసవి వినోద కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. సెలవుల్లో ఆకతాయిగా తిరిగి ప్రమాదాలకు బారిన పడనందుకు వారిని ప్రశంసించారు. కడప బాలోత్సవం అధ్యక్షులు జి. గోపాల్ వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులు చదువులలోనూ, సమాజంలోనూ ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పాల్గొన్న బాల బాలికలకు సర్టిఫికెట్లను ముఖ్య అతిథులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం నాగమణి

టిడిపి జెండాలు తొలగించిన కేసులో

13 మందికి రిమాండ్

- పులివెందుల సబ్ జైలుకు తరలింపు
- ఎంపీ అవినాష్ పిఎ, మరొకరి కోసం పోలీసులు గాలింపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : వైసిపి నాయకులు టిడిపి జెండాలు, తోరణాలు చించి వేసి, అడ్డువచ్చిన తమ నాయకులపై దాడి చేశారని టిడిపి నాయకులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఈనెల 28న అర్ధరాత్రి పోలీసులు 15 మంది, మరి కొంత మంది మీద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వీరిలో 13 మందిని అరెస్టు చేసి గురువారం అర్ధరాత్రి జమ్మలమడుగు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. జమ్మలమడుగు మెజిస్ట్రేట్ 13 మందికి 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో వీరిని శుక్రవారం తెల్లవారుజామున పులివెందుల సబ్ జైలుకు తరలించారు. రిమాండ్ విధించిన వారి వివరాలు మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, మల్లికార్జున, హల్ గంగాధర్ రెడ్డి, ఓతూరు రసూల్ , ఖాదర్‌బాష, షేక్ మస్తాన్‌వల్లి, రాజేష్, కో - ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, పెనుకొండ తరుణ్, వెంకటపతి, చలపతి ఉన్నారు. మరో ఇద్దరు కడప పార్లమెంటు సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి పిఎ రాఘవ రెడ్డి, కృష్ణపాటి గంగిరెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

తెలుగు దోపిడీ పార్టీ : పిసిసి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న తులసిరెడ్డి

టిడిపి అంటే తెలుగుదేశ పార్టీ కాదని తెలుగు దోపిడీ పార్టీ అని స్పష్టమయిందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ నాటి మహానాడుకు, ప్రస్తుత మహానాడుకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది అన్నారు.సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని ఎద్దేవ చేశారు. ఒక వైపు మహానాడు జరుగుతుంటే మరొక వైపు కడప ఎన్‌టిఆర్ సర్కిల్‌లో చిప్పగిరి మీనాక్షి అనబడే టిడిపి దళిత మహిళా కార్యకర్త పార్టీ కార్యకర్తలను పట్టించుకోవడం లేదని నిరసనగా సెల్ టవర్ ఎక్కారని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వలేదు. ముస్లిమ్ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి కొట్టుకుపోయిందని వాపోయారు. ప్రతి మహిళకు ఆడ బిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ. 1500 ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వ లేదు పేర్కొన్నారు. అన్న దాత సుఖీ భవ పథకం కింద పైసా ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రం లోనే తెలుగు భాష, తెలుగు జాతి ఉనికి కోల్పోయే ప్రమాదముంది అన్నారు.మీడియా సమావేశంలో ఎపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సత్తార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సలావుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్ధీన్, ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి భువన ఏకాదశ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు శ్యామలమ్మ, రఫీక్ ఖాన్, మామిళ్ల బాబు, నాగ రత్న, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల చేస్తున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

కందుల గ్రూప్ కామన్

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం, కెఎల్ఎం వరుసగా 5వ సంవత్సరం విజయ వంతంగా నిర్వహించిన కందుల గ్రూప్ కామన్ ప్రవేశ పరీక్ష 2కె25 ఫలితాలను కందుల గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరీ శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1,2 తేదీలలో నిర్వహించిన పరీక్షలకు 2,223 మంది హాజరు కాగా 1,719 అర్హత సాధించారని తెలిపార . కందుల శివానంద రెడ్డీ జ్ఞాపకార్థం సరైన విద్యా అవకాశాలూ లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి , విద్యా , వృత్తి ఆశయాలను సాధించే కృషికి ముఖ్య పాత్ర పోషిస్తూ, వారి అభివృద్ధి, సామర్థ్య అంచనా వేయడం, ప్రతిష్టాత్మక కందుల గ్రూప్ అనుబంధ సంస్థ లో ప్రవేశం పొందే అవకాశం, సౌకర్యాలు, స్కాలర్షిప్‌లు అందించడం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. 4 సంవత్సరాలకు గాను 12,000 పై చిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారని పేర్కొన్నారు. వారికి రూ.15 లక్షల విలువైన ఉచిత విద్య , వసతి , రవాణా, ఉచిత స్కాలర్షిప్‌లు అందించామని చెప్పారు. కేజీ సెట్ ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్షిప్ రూపేణ ప్రతి సంవత్సరం 3,500 నుంచి 10,000 వరకూ పొందుతున్నారని తెలిపారు. ఇఎపి సెట్ ద్వారా సాధించిన ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులకు స్కాలర్ షిప్స్ ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీ.ఎస్.ఎస్ మూర్తి, కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.వి రత్నమ్మ, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ విభాగ సీనియర్ ఆఫీసర్ ఆర్. నాగరాజు, కేజి సెట్ 2కె25 కన్వీనర్ అలగల హరికృష్ణ , డీన్ ఆఫ్ అడ్మిషన్స్ టి. కిషోర్ కుమార్, కేజీసెట్-2 కె25, నిర్వాహక సిబ్బంది, వివిధ విభాగాదిపతులు, టెక్నికల్ స్టాఫ్, అధ్యాపక, అధ్యాపకేతర పాల్గొన్నారు.

నూతన పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి- లింగాల : ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు నూతన పైపులైన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని దిగువ లింగాల మసీదు వీధిలో కొన్ని సంవత్సరాలుగా పైపులైన్ లేక ప్రజలు తాగునీటి తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానికులు సమస్యను సర్పంచ్ జూలువకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పైపులైన్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దోమ కాటు ఆరోగ్యానికి చేటని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ జి.హనీఫ్ బాబా పేర్కొన్నారు. శుక్రవారం ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. జి.హనీఫ్ బాబా సోములవారి పల్లె,వి వి నగర్ ఈశ్వరరెడ్డి నగర్‌లో డ్రై డే ఫ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే వ్యాధుల గురించి, వాటి నివారణ చర్యలు, పరిసరాల శుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ వర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎఎన్ఎంలు ఉమారాణి, వీరమ్మ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, శివ జ్యోతి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి- వేంపల్లి

ప్రస్తుతం మనం తినే ఆహారం వల్ల చాలామందికి సమస్యలు వస్తున్నాయని కాబట్టి రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం పదిలం చేసుకునేందుకు వీలుంటుందని ఎంపిడిఒ కులాయమ్మ పేర్కొన్నారు అంతర్జాతీయ దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో ఉన్న అమృత సరోవర్ వద్ద నందిపల్లి, కత్తులూరు గ్రామానికి చెందిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఆసనాలు, ధ్యానం, ప్రాణాయమం మీద యోగా నిపుణులు రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నెల రోజులపాటు యోగంధ్ర-2025 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, దేహ దారుఢ్యం లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల పీడీ రాజశేఖర్, ఎపిఒ పార్వతి, నందిపల్లె, కత్తులూరు పంచాయతీ కార్యదర్శులు చరణ్ కుమార్, శివకుమార్, కత్తలూరు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలేటి వాగును గాలికొదిలేశారు

- వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

ప్రజాశక- చక్రాయపేట

కాలేటి వాగును పరిశీలిస్తున్న శ్యామల

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పులివెందులపై కక్ష పెంచుకున్నారని, కాలేటి వాగు ప్రాజెక్టును గాలికొదిలేశారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కాలేటు వాగు ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 5300 కోట్లతో నిర్మిస్తున్న కాలేటి వాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయంలో పూర్తయిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం తమ పేరు వేసుకొని ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. కాలేటి వాగు ప్రాజెక్ట్ గతంలో 0.33 టిఎంసిల నుండి 1.33 టిఎసిలకు సామర్థ్యానికి పెంచి ప్రాజెక్ట్‌ను నిర్మిచారని చెప్పారు. వైఎస్ఆర్ హాయంలో 90 శాతం పనులు పూర్తయినా మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కాలేటి వాగు ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేటతో పాటు కుప్పం ప్రాంత రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఆలయ పునః నిర్మాణానికి రూ. 28 కోట్లు వై.ఎస్.జగన్ మంజూరు చేశారని చెప్పారు. గండి అలయం వైఎస్ఆర్ హాయంలోనే పూర్తయినా చిన్న చిన్న పనులు పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. **పులివెందుల రూరల్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పులివెందులపై కక్ష పెంచుకున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల వైఎస్ఆర్ మెడికల్ కళాశాలను సందర్శించారు. అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు వస్తే వాటిని వెనక్కి పంపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి నాయకులు లోకేష్ చెప్పిన విధంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆమె పులివెందుల వైసిపి ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వై.ఎస్.ప్రమీల నివాసానికి వెళ్లి వారితో పులివెందుల విషయాలపై చర్చించారు. **వేంపల్లె :** గత వైసిపి ప్రభుత్వ పాలనలో విద్యా రంగానికి ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ అన్నారు. వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచి పోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, గుంతలు పడ్డ కడప - పులివెందుల ప్రధాన రహదారిని జడ్‌పి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్, యువ నాయకుడు రోహన్ నాగిరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఇడుపులపాయ వ్యవసాయక్షేత్రంలోని వైఎస్ఆర్ సమాధికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట వైసిపి నాయకులు రోహన్ నాగిరెడ్డి రామచంద్రారెడ్డి, చక్రాయపేట జడ్‌పిటిసి బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఈశ్వరరెడ్డి ఉన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తూ సెల్ టవర్‌పై నుంచి పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మృతి చెందిన శివసాయి

పట్టణంలో దొండపాడు రోడ్డులోని జియో సెల్ టవర్‌పై మరమ్మతులు చేసేందుకు ఎక్కి ప్రమాదవశాత్తూ కింద పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుది. పోలీసుల కథనం మేరకు.. వేంపల్లికు చెందిన ముద్దు శివ సాయి (27) ఎర్రగుంట్ల పట్టణంలో రిగ్గర్ (సెల్ టవర్ రిపేరు)గా విధులు నిర్వహించేవాడు. మూడు నెలల కిందట కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వహించేవాడు. రిపేరు చేయాల్సిన వాటి సమాచారం ఉదయాన్నే సెల్లుకు మెసేజ్ వస్తుంది. ఈ క్రమంలో ఉదయాన్నే జియో సెల్ టవర్‌ను ఎక్కాడు. తను వేసుకున్న బెల్టు కొక్కిని తాపలకు ఒకటి వేశాక, మరొకటి ఊడదీసి వేసుకున్నాడు. ఈ క్రమంలో కొక్కి సరిగా తగులుకోకపోవడంతో ప్రమాదవశాత్తు కాలుజారి వంద అడుగుల పైనుంచి కింద పడి అక్కడికక్కడే శివ సాయి మృతి చెందాడు. అతడి ఒంట్లో ఎముకలు కూడా చాలా విరిగిపోయాయి. స్థానిక ఎస్ఐ నాగమురళి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ ..

ప్రజాశక్తి - కడప అర్బన్

సిద్ధవటం మండలం 1 మాధవరం అంబేద్కర్ కాలనీ చెందిన పెయ్యాల శ్రీనివాసులు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. రోజు లాగానే కడపకు వచ్చి విధులు పూర్తిచేసుకుని తిరిగి మాధవరం వెళుతుండగా సబ్ జైల్ కు దగ్గరలోని సైనిక్ నగర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసులు కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎండియు వాహనాలకు చెల్లు

రేపటి నుంచి రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

ఎండియు వాహనాలకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గత వైసిపి ప్రభుత్వం రేషన్ సరుకులను కార్డుదారులకు ఇంటి వద్దకే ఇచ్చేందుకు ప్రవేశపెట్టిన ఎండియు వాహనాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీని జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనుంది. ఈ రేషన్ సరుకులను డీలర్ల వద్దనే పంపిణీకి సంబంధించి రెవెన్యూ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. గతంలో ఎండియు వాహనం ఎప్పుడు వస్తుందో, వెళుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉండేది. ఈ క్రమంలో రేషన్ కార్డుదారులు ఎండియు వాహనం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. నెలలో ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు రేషన్..

65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగులు, భార్యాభర్తలు ఇద్దరు వృద్ధులైన వారికి ఇంటి వద్దకే వచ్చేనెల1 నుంచి 5లోగా డీలర్ వెళ్లి రేషన్ సరుకులు ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఇల్లు మారి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి కూడా పోర్టబిలిటీ విధానం ద్వారా సమీప రేషన్ దుకాణంలో రేషన్ పొందేలా రూపకల్పన చేశారు.

రేషన్ దుకాణం వద్దనే బియ్యం పంపిణీ

జూన్ నుంచి రేషన్ దుకాణం వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేస్తారు. కావున కార్డుదారులు దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తీసుకెళ్లాలి. నిర్ణీత సమయంలో కార్డుదారులు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి.

- నాగేశ్వరరావు, తహశీల్దార్, సింహాద్రిపురం.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

సంత వేలం పాటలో రూ.57 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - వేంపల్లె : వేంపల్లె పంచాయతీకి సంబంధించి సంత మార్కెట్ కు వేసిన వేలం పాట ద్వారా రూ. 57.5 లక్షల ఆదాయం వచ్చినట్లు పులివెందుల డిఎల్‌పిఒ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ సంత మార్కెట్‌కు వేలం పాట నిర్వహించారు. వేలం పాటకు మధుశ్రీ దేవి, వెంకట రమణారెడ్డి, ఈశ్వరరెడ్డి అనే ముగ్గురు వ్యక్తులు వేలం పాటలకు డిడిలు తీశారు. డిడి తీసిన మధుశ్రీ దేవి అనే మహిళ వేలం పాటకు హజరు కాకుండా ఆమె భర్త వేలం పాటకు హజరు కాగా పాట దారులు వ్యతిరేకించారు. వేలం పాటను పాడేందుకు వీలు లేదని డిడిని రద్దు చేయాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు చెప్పారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం అందరిని బయటికి పంపించి డిడిలు తీసిన ఇద్దరు వ్యక్తులు మధ్య వేలం పాట నిర్వహించారు. దీంతో పోటాపోటీగా వేలం పాట కొనసాగింది. గత ఎడాదిలో 10 నెలలకు గాను రూ 40.30 లక్షలు పంచాయతీకి ఆదాయం రాగా ఈ ఏడాది రూ 57.05 లక్షల వచ్చిది. దాదాపు రూ 17 లక్షలు అదనంగా ఆదాయం పెరిగింది. ఈ వేలం పాటలో మల్లూరు వెంకట రమణారెడ్డి సంత మార్కెట్ వేలం పాటను దక్కించుకున్నారు.పంచాయతీకి చెందిన షాపింగ్ గదులకు చెందిన వేలం పాటను అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఇఒఇపిఆర్‌డి గురునాథ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు కొద్ది రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయన అనారోగ్య విషయం తెలుసుకున్న టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ శుక్రవారం పరామర్శించారు. ప్రొద్దుటూరు పట్టణ బిసి నాయకుడిగా, తెలుగు దేశం నాయకుడిగా పాణ్యం సుబ్బరాయుడు అందించిన సేవలను గుర్తు చేశారు. వ్యాధి నుండి త్వరగా కోలుకొని పార్టీకి, పట్టణానికి తన సేవలు అందించాలని ఆయన కోరారు. బిసి నాయకుడు పోలా భాస్కర్, 30వ వార్డు టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

రేపటి నుంచి వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వృషభ చలేశ్వర స్వామి అనుసంధానమైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ 1 నుండి 3 వరకు స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ విశ్వనాథరెడ్డి, అర్చకులు అచ్యుత్ నారాయణ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆదివారం భాగవత విజ్ఞాపనం విశ్వక్సెన ఆరాధన, అంకురార్పణ ఆలయ సంప్రోక్షణ సహిత కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయాని చెప్పారు. 2న సుదర్శన హోమం, పవిత్ర సమర్పణ, విష్ణు సహస్రనామ పారాయణం, వేద పారాయణం, 3 న మహా విష్ణు హోమాలు, మహా పూర్ణాహుతి, ప్రధాన కలశ విసర్జన తనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఉంటాయని చెప్పారు. సాయంత్రం స్వామివారి బ్రహ్మోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాలు వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, వైసిపిరాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్ వేణుగోపాల్ సహకారంతో నిర్వహించుతున్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైసిపి నుంచి టిడిపిలోకి పలువురు చేరిక

ప్రజాశక్తి- పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని సరస్వతి విద్యా మందిరం సమీపంలో ఉన్న ఆయిషా మసీదు సమీపంలో నివాసం ఉంటున్న ముస్లిం మైనారిటీ సోదరులు షేక్ బాషా (వేల్పుల బాపు)15 కుటుంబాలు ఆధ్వర్యంలో శుక్రవారం పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి ఆధ్వర్యంలో వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి.పార్టీలో చేరిన చేరిన వారికి బిటెక్ రవి టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కార్యకర్తలకు ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువచ్చే వాటి పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం జూన్ నెలలో ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తుంటే అందరికీ రూ. 15వేలు ఇస్తారన్నారు. ఇవ్వడం జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో రఫీ , మాబాష, షబ్బీర్, బాష, కరిముల్లా, సత్తార్, హిమంబి, సాధకున్, మున్ని, షబానా, ఖాజాబీ, గౌసియా, తస్లీం, బావవలి,లు రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతిని ధి , రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా ఉన్నారు. కార్యక్రమ ంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కాశీం వల్లి , గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

మూలన పడిన ట్రై సైకిళ్లను పంపిణీ చేయాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పట్టణంలో పతంగి రామన్న ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉన్న క్రీడా వికాస కేంద్రంలో కొన్ని ఏళ్లుగా మూలనపడ్డ ట్రైసైకిళ్ల ప్రభుత్వ అధికారులు పంపిణీ చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం వారు ట్రైసైకిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ చాలా రోజులుగా ట్రై సైకిళ్లు మూలాన పడ్డాయన్నారు. అవే సైకిళ్లు విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేస్తే చాలా వరకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం తీవ్రంగా కనబడుతుందని తెలిపారు. మరో వైపు క్రీడా వికాస కేంద్రానికి వాచ్‌మెన్ లేక పోవడంతో ట్రై సైకిళ్లు దొంగతనం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. పట్టణంలో ఇప్పటికీ చాలా మంది ట్రై సైకిళ్లు లేక ఇబ్బందిపడుతున్నారని వారిని గుర్తించి దరఖాస్తులు స్వీకరించి త్వరితగతిన పంపిణీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా తోరణాలు తొలగింపు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన పచ్చ తోరణాలను శుక్రవారం పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్‌రవి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, హక్కులు గారి విజయ్ కుమార్ రెడ్డి, స్వయంగా కట్ చేసి తొలగింపజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైసిపి నాయకుల కన్నా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అంటే తమకు ఎంతో అభిమానం ఉందన్నారు. మహానాడు కార్యక్రమం అయిపోయిన వెంటనే తామే తొలగిస్తామని చెప్పినా కూడా కొంతమంది వైసిపి గుండాలు అక్కడికి వచ్చి తోరణాలు జెండాలు పీకి కాళ్లతో తొక్కి ఇష్టాచారంగా చేయడం దారుణమన్నారు. ఒకవేళ తొలగించాలని ఉంటే మున్సిపల్ కమిషనర్ కానీ, పోలీసులకు గాని తెలియజేయాలన్నారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు తోరణాలు తగలకుండా కట్టారన్నారు. టిడిపి తోరణాలు తొలగించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సింహాద్రిపురం మండల ఇన్‌ఛార్జి మారెడ్డి జోగిరెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి జయభరత్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, అజ్జు గుట్టు రవితేజ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, అక్కులు గారి విజయకుమార్ రెడ్డి, ఖాసిం వలి, గంగాధర్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి తోరణాలు తొలగిస్తున్న బిటెక్ రవి, నాయకులు

మాట్లాడుతున్న చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణంలో పాత రైల్వే గేటు సమీపంలో, తిప్పలూరులోని అనాథాశ్రమాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి స్థానిక వైద్య అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న అర్బన్ ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, కమిషనర్ శేషఫణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసులతో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. స్థానికంగా మందుల కొరత కానీ, ఇతరత్రా ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలపాలని చెప్పారు. ఇక్కడికి వస్తున్న ఒపి పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు తెలిపారు. మెడికల్ క్యాంపులు పెట్టాలని, అందుకు తమ వంతు సహాయం కూడా అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

ఫీజులను నియంత్రించాలి

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రయివేట్ విద్యాసంస్థలలో ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ కుమార్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు పునః ప్రారభమవుతున్న నేపథ్యంలో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. జీవో నెంబర్ 77 రద్దు చేసి పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ముందస్తు అక్రమ అడ్మిషన్లు, ఫీసులని నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

మహానాడు దిగ్విజయం

- ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సమైక్య రాష్ట్రంలో ఎన్నడూ జరగని విధంగా మహానాడును అందరూ కలిసి కట్టుగా దిగ్విజయం చేశారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం తర్వాత కడపలో మొదటి సారి మహానాడు నిర్వహించారన్నారు. గురువారం నిర్వహించిన మహానాడు బహిరగసభలో సుమారు 5 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. కడపలో మహానాడు నిర్వహించడం మనకు గౌరవమని, అన్ని నియోజకవర్గాల నుండి ప్రజలు మహానాడుకు తరలి వచ్చారని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుండి మహానాడుకు బస్సులు కార్లలో తరలి వెళ్ళామన్నారు. చాలా వరకు బస్సులు తాము కూడా ప్రజలకు అందించ లేక పోయామని ,ప్రజలు స్వచ్ఛందంగా మహానాడుకు తరలి వచ్చారు అనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ జూన్ 12న పనులు మొదలు పెడుతున్నట్లు సీఎం ప్రకటించటం ఆనందదాయకమన్నారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీపేట గురువిరెడ్డి, టిఎన్‌టియుసి నాయకుడు కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

'ఉక్కు' పనులపై హామీ ఇవ్వడం హర్షణీయం

ప్రజాశక్తి- వేంపల్లి

కడపలో నిర్వహిచిన టిడిపి మహానాడులో స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇవ్వడం హర్షనీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు రఘునాథరావు, ప్రసాద్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. జిల్లాకు తలం మానికంగా ఉన్న స్టీల్ ప్లాంట్‌ను గత ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో పాటు పనులు కూడా చేపట్టలేదన్నారు. ఐదు సంవత్సరాల నుండి శంకుస్థాపనకే పరిమితం కావడంతో నిరుద్యోగులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు లోపు పూర్తి చేస్తే ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పారు. దాదాపు రూ .4500 కోట్లతో మొదటి ఫేస్ పనులు జరుగుతాయని ముఖ్యమంత్రి ప్రకటించడంతో జిల్లా వాసులుకు ధైర్యం వచ్చిందని అన్నారు. అరూ 1000కోట్లతో గాలేరు - నగరి ద్వారా కడప పట్టణ ప్రజల దాహార్తి తీర్చానున్నట్లు ప్రకటించడం ఎంతో సంతోషమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై జ్వాలా శ్రీకాంత్ చేస్తున్న ఆరోపణలో ఎలాంటి నిజాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో బ్రాహ్మణులకు మంచి జరుగుతున్నదని ఆ విషయాన్ని జ్వాలా శ్రీకాంత్ గ్రహించాలని చెప్పారు.

ప్రభుత్వ వైద్య శాఖలో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది

- ఆర్‌డిఎంహెచ్‌ఎస్ ఆఫీస్ సూపరింటెండెంట్ రాచమల్ల గోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వవైద్య శాఖలో 39 సంవత్సరాలు పనిచేయడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని ఆర్‌డిఎంహెచ్‌ఎస్ ఆఫీసు సూపరింటెండెంట్ రాచమల్ల గోపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 3న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యలో రాచమల్ల గోపాల్‌రెడ్డి ప్రజాశక్తితో మాట్లాడారు. రాచమల్ల బాల అశ్వర్థ రెడ్డి, రాములమ్మ దంపతులకు 1963వ సంవత్సరం కమలాపురంలో తను జన్మించినట్లు తెలిపారు. తన విద్యాభ్యాసం ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు కడప జిల్లా కమలాపురం అప్పర్ ప్రైమరీ స్కూల్లో సాగిందని చెప్పారు. ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు కడపలోని సిఎస్ఐ హైస్కూల్లో చదివినట్లు తెలిపారు. ఇంటర్ కడప చిన్న చౌకులోని, రామసుబ్బన్న జూనియర్ కళాశాలలో చదివినట్లు చెప్పారు. డిగ్రీ కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేసినట్లు తెలిపారు. 1986వ సంవత్సరంలో తండ్రి మరణిం చడంతో ఆయన ఉద్యోగం తనకు వచ్చిందని తెలిపారు. కడపలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చినట్లు తెలిపారు. అక్కడే 1993 వరకు పని చేశానని చెప్పారు. అదే సంవత్సరం ఉద్యోగోన్నతి ఉంది సీనియర్ అసిస్టెంట్‌గా తొండూరు మండలంలోని, పోరా గుట్టపల్లె, పిహెచ్‌సిలో పనిచశానని తెలిపారు. 1994 సంవత్సరం బదిలీపై వచ్చి నందిమండలం పిహెచ్‌సిలో 1997 వరకు సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసినట్లు చెప్పారు. అదే సంవత్సరం బదిలీపై కడప ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా 2013 వరకు పని చేసినట్లు తెలిపారు. అదే సంవత్సరం సూపరిటెండెంట్ ఉద్యోగోన్నతి పొంది, కడప గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, రిమ్స్ 2017 వరకు పనిచేసినట్లు చెప్పారు.

అదే సంవత్సరం బదిలీపై అనంతపురం డిఎం అండ్ హెచ్ ఓ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా 2019 వరకు పనిచేసినట్లు తెలిపారు. రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ కడపలో సూపరిండెండెంట్ పనిచేస్తూ 2025 ఈనెల 31న ఉద్యోగవిరమణ పొందుతున్నానని చెప్పారు. తన 39 సంవత్సరాల రెండు నెలల సర్వీస్ కాలంలో అనేక ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. తను ఉద్యోగ బాధ్యతలు చేపడుతూనే మరో పక్క ఏపీ మెడికల్ మినిస్టీరియల్ స్టాఫ్ జిల్లా అధ్యక్షులుగా, ఏపీ ఎన్‌జిఒ అసోసియేషన్ కడప తాలూకా ట్రెజరర్‌గా, జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు సక్రమంగా నిర్వహించానని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశానని తెలిపారు.

అందరి మన్ననలు మరవలేను

- డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ ఇండ్ల మురళీమోహన్

ప్రజాశక్తి - కడప

38 సంవత్సరాల 7 నెలలు తన సర్వీసులో అంకితభావంతో పనిచేసి అందరని మన్ననలు పొందడం మరువలేనని వైఎస్ఆర్ కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇండ్ల మురళీమోహన్ చెప్పారు. ఈనెల 31న ఉద్యోగ వివరణ చేయనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఇండ్ల లక్ష్మీనారాయణ, ఇండ్ల జయమ్మ దంపతులకు 1963వ సంవత్సరంలో తాను జన్మించినట్లు తెలిపారు. తన విద్యాభ్యాసం ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు కడప జిల్లా జమ్మలమడుగు, ఇడిగపేట ప్రాథమిక పాఠశాలలో సాగిందన్నారు. ప్రాథమిక విద్య జమ్మలమడుగు ప్రభుత్వ పాఠశాలలో సాగిందని తెలిపారు. ఇంటర్ జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు డిగ్రీ కాలేజీలో పూర్తి చేశానని చెప్పారు. 1987వ సంవత్సరంలో తన తండ్రి చనిపోవడంతో ఆయన ఉద్యోగం తనకు వచ్చిందని తెలిపారు. కమలాపురం డిప్యూటీ స్కూల్ ఇన్‌స్పెక్షన్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా ఆ ఉద్యోగం తనకు వచ్చిందని తెలిపారు. 1992 రెండు వరకు విధులు నిర్వహించానని చెప్పారు. అదే సంవత్సరంలో ఉద్యోగోన్నత పొంది రాయచోటి డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా 1994 వరకు పని చేసి అదే సంవత్సరం బదిలీపై నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధలు నిర్వహించానని తెలిపారు. అక్కడే 2000 సంవత్సరం వరకు పనిచేసినట్లు చెప్పారు. అదే సంవత్సరం బదిలీపై కడపలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి జూనియర్ అసిస్టెంట్, 2007 సంవత్సరంలో ఉద్యోగోన్నత పొంది సర్వ శిక్ష అభియాన్‌లో సీనియర్ అసిస్టెంట్ గా బాధ్యతలు చేపట్టి

2013 వరకు పనిచేసినట్లు తెలిపారు. అదే సంవత్సరం బదిలీపై జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా 2018 వరకు పనిచేశానని చెప్పారు. 2019 సంవత్సరం ఉద్యోగోన్నతి పొంది సూపరింటెండెంట్‌గా కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో 2021 వరకు పని చేసినట్లు తెలిపారు. అదే సంవత్సరం బదిలీపై కడప జిల్లాలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా 2025 వరకు పనిచేసినట్లు తెలిపారు. అదే సంవత్సరం బదిలీపై జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ పని చేస్తూ ఈనెల 31న విరమణ చేస్తున్నట్లు వివరించారు. తన సేవలను గుర్తించి అప్పటి కలెక్టర్, అప్పటి జిల్లా ఇన్‌ఛారిజ మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు ఇండ్ల మురళీమోహన్ చెప్పారు.